అంబిక చాలా ఆలోచించి ఇంద్రసేనని పిల్చి చెప్పింది.

"ఇందూ నువ్వు ఈ ఊళ్లో ఉండటం మంచిదికాదు."

"ఎలా వదినా! ఏం చెయ్యమంటావు" అంది భయంగా.

"నిన్ను ఏ ఊరు అయినా పంపించేస్తాను" అంది అంబిక.

"ఏ ఊరు!" అడిగింది.

"నీ స్నేహితురాలు యింటికి పెళ్ళికి వెళ్తాను అన్నావుగా! మీ అమ్మా నాన్నగారితో చెప్పి అక్కడికి పంపిస్తాను. నువ్వు వారంరోజులు అక్కడే ఉండిరా" అంది రహస్యంగా.

ఇందు ఉత్సాహంగా ఒప్పుకుంది.

అంబిక మనసులో నవ్వుకుంటూ అత్తగార్ని మావగార్ని ఒప్పించింది.

వాళ్ళ కూతుర్ని పెళ్ళికి పంపించడానికి కోడలుమాటమీద ఒప్పుకున్నారు.

జయరామ్ ట్రయిన్‌లో చెల్లెల్ని తీసుకునివెళ్ళి దిగబెట్టి వస్తాను అంటే అంబిక వద్దు అని, ఆ ఊరు తన స్నేహితురాలు వనిఉంది కారులో వెళ్తుంది అని, ఆమెతో పంపిస్తాను అని చెప్పటంతో ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. సరే అని ఒప్పుకున్నారు.

ఇందు ఉత్సాహంగా ప్రయాణం అవసాగింది.

అంబిక ఎవరితోనో ఫోన్‌లో చాలాసేపు మాట్లాడింది రహస్యంగా.

అంబిక మనసు తేలిక అయింది.

మనసు అంతా సంతోషంగా ఉంది.

ఆ మర్నాడు ఉదయం ఆమె స్నేహితురాలు కారు తీసుకు వస్తుంది. ఆ కారులో ఇందు వెళ్తుంది, ఆమె ఫ్రెండ్ యింటికి.

మర్నాడు కారు రాగానే ఇందు అందరికీ చెప్పి మహారాణిలా కారులో కూర్చుంది.

అంబిక తన స్నేహితురాలికి అడపడుచు, జాగ్రత్త అని చెప్పింది.

కారు బయలుదేరి వెళ్ళిపోయింది.

అంబిక సంతోషానికి పట్టపగ్గాలు లేవు.

ఆమె ఉత్సాహంగా ఉంది.


ఆమె ఉత్సాహాన్ని మనసులో దాచుకుంది.

ఎవ్వరికీ తెలీదు.

అదే రహస్యం.

(సశేషం)





# పేదతల్లి పెన్నిధి

పాలడుగు వెంకటేశ్వరరావు

ఒక వారం రోజుల్నించీ ఎడతెరిపి లేకుండా వర్షం దంచికొట్టింది. అయితే కుండల్తో ధిమ్మరించినట్లూ, కాకుంటే సన్నసన్నగా జల్లూ. ఆకాశం నిండా నల్లగా మబ్బులు. సూర్యుడు కనపడనే లేదు. అంతా మురికిమురికిగా తయారయింది. ఈగలు, దోమలు పుట్టుకుని వచ్చాయి. స్వైరవిహారం మొదలుపెట్టాయి. బజార్లో గుంటలు నీటితో నిండిపోయాయి. రోడ్లు బురదతో లసలసగా అయ్యాయి. దుర్గంధం! ముక్కుల్ని బద్దలుకొట్టే దుర్గంధం, గాలిలో తేలిరాసాగింది. వాతావరణం అసహ్యంగా గబ్బుగొడుతూ వుంది. పల్లపుప్రాంతాలు నీట మునిగిపోయాయి. ఇంకా సన్నగా తుప్పర పడ్తూవుంది. వీధులు దాదాపు నిర్మానుష్యంగా అయ్యాయి! చీకటి నల్లగా అంతటా అలముకుంది. వానకి

వీధిదీపాలు మిలమిలలాడాయి. జనాలు ఇళ్ళల్లో ముడుచుకుని వుండిపోయారు:


కలిగిన మారాజులు, కడుపులు నింపుకుని వెచ్చదనంకోసం తలుపులు మూసిన గదుల్లో దుప్పట్లనీ, శాలువాలనీ ఆశ్రయించారు. అయిదువేళ్ళూ నోటిలోపలికి పోవటమే సమస్య అయినవాళ్ళదే సమస్య: ఆకలి భయంకరమయినది. అది తీరాలనే జీవుడి తాపత్రయం. ఆకలి చల్లారని కడుపులు లోపలికి తోసుకుపోతాయి. ఆ కడుపుల్లోని పేగులు నీరసంగా అరుస్తాయి. శక్తిలేని ప్రాణం ఇక నిస్త్రాణకి లోనవుతుంది. అదే ముఖ్యమయిన సమస్యగా, ఆకలిని తీర్చుకోవటానికే రకరకాలుగా ప్రయత్నాలు సాగిస్తుంది, ఆకలికి గురిఅయిన ప్రాణి. అందుకోసమే బ్రతుకులూ తెల్లారతయి.

'హోటల్ అన్నపూర్ణ' వెనకాలవున్న ఆ యిరుకు మురికిసందు దుర్గంధభూయిష్టమై వుంది. పందులూ, కుక్కలతో నిండివుంది. ఈగలు, దోమలు, గాడిదలు కూడా ఆ సందులో సమృద్ధిగానే వున్నాయి. మూసేసిన మంగలిబడ్డీ నానుకుని కూర్చునివున్నాడు, పిచ్చయ్య. పిచ్చయ్యకి పదేళ్ళు. వొంటిన బట్టలేదు, మొలను గోచీ తప్ప. పిచ్చయ్య కళ్ళు గుంటలుపడి లోతుకుపోయి వున్నాయి. కడుపు వెన్నుకు అంటుకునిపోయి వుంది. శరీరంలోని ఎముకలు చర్మాన్ని పొడుచుకుని తొంగిచూస్తున్నాయి. ఆ కళ్ళల్లో ఆకలి చూపులు. కడుపు ఆకలిమంటతో అల్లాడుతూ వుంది. చాలాసేపట్నుంచి తడుస్తూనే కాచుకుని అక్కడున్నాడు పిచ్చయ్య.

'హోటల్ అన్నపూర్ణ'లో సందడి ప్రారంభమయింది. పెందరాళే ఇంత తిని గూళ్ళు చేరదామని కాబోలు అనుకుని కస్టమర్లు రావటం ప్రారంభించినట్లు, గోడ అవతల్నుంచి వినవస్తూవున్న సర్వర్ల, క్లీనర్ల అరుపులనుబట్టి తెలుస్తూ వుంది. ఆ సందులోకి మురికి దుర్గంధంతో పాటుగా, హోటల్ లోపల్నుండి అప్పుడు వివిధ పదార్థాల వాసనలు తేలిరావటం ప్రారంభమయింది. పిచ్చయ్యకి నోరూరింది. అప్రయత్నంగా వూరిన లాలాజలాన్ని దిగమ్రింగాడు. కడుపులో ప్రేగులు ఆందోళనాపద్ధతిన అరిచాయి. రెడీ అయి, నిశితంగా ఆ చీకట్లోకి దొంగలాగా నలువయిపులా పరకాయించి చూసాడు పిచ్చయ్య. సందులోని చీకటి తెరల దగ్గరల్లో నరమానవుడి అలికిడి లేదు. కుక్కలూ, పందులూ మాత్రం హడావుడిగా తిరుగుతున్నాయి: ఆ దొంగనాయాళ్ళందరూ, ఏ బృందావన్ వెనకాలో చేరివుంటారు- అనుకుని తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు పిచ్చయ్య. బృందావన్ నాన్‌వెజిటేరియన్ హోటల్. అన్నపూర్ణ వెజిటేరియన్. ఏదో ఒకటి చాలు, ఒకటి లభ్యమయిన క్షణంలో గదా, రెండవదాని గురించి ఆలోచనా:








(1964 యువ దీపావళి ప్రత్యేక సంచిక నుండి)

ఇక ఇంకా ఆలస్యమయితే మబ్బులాగా క్రమ్ముకుని వస్తారు 'వాళ్ళు.' ఆత్రంగా నిరీక్షించాడు పిచ్చయ్య. అతనిలో ఆత్రుత పెరిగినకొద్దీ ఆలస్యం ఎక్కువ అయ్యింది. ఆలస్యంగానే అయినా చివరికి అతని నిరీక్షణ ఫలించింది. భోజనాల బ్యాచీలు తిని లేచిపోవటం ఆరంభమయినట్లుగా వుంది. గోడ అవతల్నుంచి ఉండలుచుట్టిన ఎంగిలి విస్తళ్ళు దబ్బుదబ్బున ఎగిరివచ్చి ఆ సందులో పడనారంభించాయి. కూర్చున్న చోటునుంచి లేచి ఆత్రంగా అటు పరుగెత్తాడు లేడిలాగా పిచ్చయ్య అప్పటికే అక్కడ చేరిన పందులూ, కుక్కలూ హడావుడి ప్రారంభించాయి.

'ఛేయ్ ఛేయ్. నీయమ్మ: పోండి. పోండి' అంటూ వాటిని అదిలించాడు పిచ్చయ్య. అవి అంత దూరాన్నే చేరి పిచ్చయ్యవంక గుర్రుగా చూడసాగాయి. ఆ విస్తళ్ళు అన్నీ దాదాపుగా ఖాళీగానే వున్నాయి. ఈ మధ్యన ఎంగిలి ఆకుల్లో మిగిలిన పదార్థాలతో కూడా వ్యాపారాలు చేయటం మొదలయింది. అందువలన ఎగిరివచ్చే ఆ ఆకులు దాదాపు వట్టివిగానే వుంటున్నాయి. అయినా ఆశ చావదు. అందుకే నిరీక్షణ. దానిలో కూడా పోటీ. పోటాపోటీ. యుద్ధాలూ.

దబ్బున బరువుగా వచ్చి పడింది ఒక ఆకు. అది క్రింద పడకుండానే దాన్ని అందుకున్నాడు పిచ్చయ్య. బద్ధకస్తుడైన ఒక క్లీనరు ఎంగిలాకుని ఖాళీచేయటాన్కి బద్ధకించి, ఆ పళాన విసిరేసాడు.

అటువంటివాళ్ళే పిచ్చియ్యలాంటి వాళ్ళకి దేవుళ్ళు. ఆ ఆకు బరువుగా వుంది. ఇంత అన్నం, కూరలూ వున్నాయి. దాన్ని ఒంగచుట్టుకుని పరుగుఅందీసాడు పిచ్చయ్య. మళ్ళీ మళ్ళీ చూస్తే వెంట బడక మానరు, వాళ్ళు నలుగురు తను ఒక్కడు! వచ్చి మీదబడితే గెలవలేడు. వేటకుక్కలు నయం. తను ఒంటిగాడు పైగా.

ఆ కుటుంబంలో ముగ్గురు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళలో పిచ్చయ్యే పెద్దవాడు. తల్లి కష్టజీవి. కానీ రాజమ్మది రోగిష్టి శరీరం. తండ్రి తాతయ్య వట్టి త్రాగుబోతు. అతను పనిచేస్తాడు. సంపాదిస్తాడు. కాని ఆ సంపాదించింది పూర్తిగా త్రాగి ఏ రాత్రికో ఇల్లు చేరతాడు. ఆకలితో అలమటించే అభంశుభం తెలియని పసిపిల్లలు. వాళ్ళ ఆకలి తీర్చ లేని కన్నతల్లి కన్నీటి చూపులు. బాధ్యతలు ఎరుగని జన్మదాత తండ్రి. గాలికి అటూ ఇటూ వూగి విరిగిన కర్రల గుడిసె. వానకి తడిసిన నేల లసలస. ఆకలిమంటలకి నిద్రకి నోచుకోని కొన్ని జతల కళ్ళు. చిటచిట కుట్టి వదిలిపెట్టే దోమల గుంపులు. గాలికి అల్లలాడే గుడిసెలోని గుడ్డి దీపం. ఇది దరిద్రం. ఆకలి బాధ్యతారాహిత్యం. నిరాశా నిస్పృహల నిలయం. ఆకలి మంటల దరిద్రనారాయణుల లోకం. శాపగ్రస్తం.

పిచ్చయ్య ఆ అన్నం ఆకుని తీసికెళ్ళి అమ్మకి ఇస్తాడు. అమ్మ ఎంతో ఆనందిస్తుంది. హడావుడి చేస్తుంది.

'బాబూ! ఒరేయ్. లెండ్రా! అన్నయ్య అన్నం తెచ్చాడు. తిందురుగానీ,' అంటూ హడావుడి చేస్తుంది. ఆ తెచ్చిన అన్నాన్ని వాటాలు వేసి తలా ఇంతా పెడ్తుంది. ఏదో ఇంత తిని నీళ్ళుతాగితే, ఆ పూట ఇక చెల్లిపోతుంది. అంతకంటే కావలసింది ఏముందీ? ఆకలికి జిల్లాడే కడుపులకి?

నడుస్తూనే ఆలోచిస్తున్నాడు పిచ్చయ్య. అతను ఇంకో ఆ సందు దాటి, నాలుగడుగులు వేస్తే జంక్షన్ వస్తుంది. అక్కడ్నించి, చీకట్లోకి మళ్ళి, మురుక్కాలవ దిశగా ఒక ఫర్లాంగు నడిస్తే తమ గుడిసె వస్తుంది. అమ్మయ్య! భగవంతుడి దయవలన ఈ పూట ఇలా చల్లగా గడిస్తే! అదే పదివేలు!!

చకచక ఆ సందు చివరికి వచ్చాడు పిచ్చయ్య. జంక్షన్ దగ్గర లైటు క్రింద 'వాళ్ళు' గుంటకాడ నక్కల్లా కూర్చుని వున్నారు వాళ్ళు! వాళ్ళనిచూసి పిచ్చయ్య పరుగు లంకించుకున్నాడు. వాళ్ళు పిచ్చయ్యని చూడనే చూసారు. వేట కుక్కల్లాగా వెంటబడ్డారు. దున్నపోతుల్లాగ వుండే ఆ నలుగురూ అన్నదమ్ములు.

'అదుగో వాడు! పిచ్చయ్యగాడురోయ్'

'వాడి చేతిలో పొట్లం! అన్నమల్లే వుంది!'

'పిచ్చయ్యా! ఆరేయి ఆగరా'— అన్న అరుపుల్తో వాళ్ళు పిచ్చయ్యవెనకాల పరుగెత్తి వచ్చారు. వాళ్ళల్లో ఒకడు పిచ్చయ్య చేతిలోని పొట్లాన్ని బలవంతంగా లాక్కున్నాడు. పిచ్చయ్య ఎదురు తిరిగి పోరాడాడు. ఒకడు పిచ్చయ్యని రెండుచేతులూ వెనక్కి విరిచి పట్టుకోగా ఇద్దరు అతన్ని తన్నారు. క్రిందకి తోసి పడవేసి, కాళ్ళతో చేతుల్తో కొట్టారు. పారిపోయారు. పిచ్చయ్యకి ముక్కువెంట రక్తం కారింది. అతని శరీరమంతా బురద బురదగా అయింది. ఏది ఏమయినా లెక్క లేదు. కాని, వాళ్ళు ఆ పొట్లాన్ని వూడ పెరుక్కుని పోయారు! పిచ్చయ్య కోపంతో అమ్మలక్కలు తిట్టాడు. బోరుమని ఏడ్చాడు. అతని ఏడ్పు గాలిలో కలిసిపోయింది. వర్షం పెద్దదయింది. లేచి నిలబడి నీరసంగా, దీనంగా అలా నడిచి గుడిసెకి చేరుకున్నాడు పిచ్చయ్య. పిచ్చయ్య అడుగులు తడబడ్డాయి. వొళ్ళంతా నొప్పులు.

గాలికి గుడిసెలోని గుడ్డిదీపం అల్లల్లాడుతూ వుంది! చిన్నపిల్లలు అందరూ నిద్రపోతూ వున్నారు. వాకిలి దగ్గరే కూర్చుని ఎదురుచూస్తూ వుంది పిచ్చయ్య తల్లి రాజమ్మ! అతన్ని గారంగా చూసి ఆప్యాయంగా పలకరించింది, వాత్సల్యామృతాన్ని మాటలలో రంగరిస్తూ.

'ఈ వానలో, ఇప్పుడుదాకా ఎక్కడున్నావురా, నాన్నా! కుండలో నీళ్ళున్నాయి. కాళ్ళు కడుక్కు రా' అని అంది ఆదరంగా. పిచ్చయ్య కాళ్ళు కడుక్కువచ్చాడు. గుడ్డతో మొహం తుడుచుకున్నాడు. రేగిన జుట్టుగల ఆ తల్లి— 'నాన్నా! దా. అన్నం తిను బాబూ' అంది. ఆమె దగ్గరనే కూర్చుని భక్తిగా ఆమె వయిపే అలా కాసేపు చూసి— 'అన్నం ఎక్కడిదే అమ్మా?' ఆశ్చర్యంగా అడిగాడు పిచ్చయ్య.

'ఇవ్వాళ ప్లీడరుగారింట్లో 'కార్యం' జరిగిందిరా. మిగిలిందని చెప్పి ఆ తల్లి ఇంత అన్నమూ కూరలూ పెట్టి ఆ తల్లి పుణ్యం కట్టుకుందిలే! రా మరి! ఆకలిగా లేదంట్రా వెర్రినాయనా?' అని మెత్తగా మందలిస్తూ కొడుక్కి అన్నంముద్ద నోటికి అందించబోయింది, రాజమ్మ. పిచ్చయ్య వారించాడు.

'అమ్మా! చిన్నాళ్ళు తిన్నారా? లేదా?' అని అడిగాడు జాలిగా, దిగులుగా.

'ఆఁ. వాళ్ళు తినే నిద్రపోయారు. నువ్వు తినూ' ఆప్యాయంగా అంది తల్లి. పిచ్చయ్య ఆకలి విజృంభించబోయింది. 'అమ్మా మరి నీకో?' అన్నాడు తినబోయేవాడల్లా ఆగిపోయి పిచ్చయ్య.

'అబ్బ! నేను తిన్నాలేరా. నువ్వు తిను.'— అంటూ అన్నం పెడ్తున్న ఆ చేతిని అట్లాగే గట్టిగా పట్టుకున్నాడు పిచ్చయ్య. 'అమ్మా. నువ్వు తినలేదు, నువ్వు తినకపోతే నేనూ తినను. అంతే.' గట్టిగా అని, మొండికెత్తాడు. చివరికి రాజమ్మ నిజాన్ని వప్పుకుంది. 'నాకు ఆకలిగా లేదులేరా. నాకు వద్దుగాని నువ్వు తిను నాయనా' అని బ్రతిమాలింది, కొడుకుని. పిచ్చయ్యకి ఈ మధ్యన విషయాలు తెలుస్తున్నాయి.


'అమ్మా! అట్లా వీల్లేదు. మా అందరి ఆకలినీ తీర్చటానికే నువ్వు నీ ఆకలిని చంపుకుంటున్నావు. అందుకే— ఇప్పుడు నీకు ఆకలిగా లేదు. అంతేగదమ్మా!' అని కళ్ళనీళ్ళు పెట్టాడు పిచ్చయ్య— ఏడ్చాడు బిగ్గరగా.

'ఏమంత వయస్సు రాకపోయినా, నీ ఆలోచనలు అంతదూరం వెళ్ళాయా తండ్రీ! ఆ కట్టుకున్న పెద్దమనిషి ఏనాడూ కష్టం సుఖం కనుక్కోక పోయినా, ఈనాటికి ఎదిగివచ్చి ఆ బాధ్యత నీ భుజాన వేసుకుందామనుకుంటున్నావా నాయనా!?' అంది రాజమ్మ శోకం ముంచివేయగా. ఆమె కడుపు చెరువయింది. ఆమె శోకతప్త నయనాలు చాలాకాలం తర్వాత ఆనందబాష్పాలు రాల్చాయి. మళ్ళీ వర్షం కుండపోతగా కురవటం ప్రారంభమయింది.



# నాకు నచ్చిన నా కథ

నిప్పుతో చెలగాటం ముప్పుకు మూలం అన్న సత్యం అందరూ ఎరిగినదే. అయినా — తనవరకు వచ్చేసరికి ఆ విషయాన్ని విస్మరించడం సహజం .... ఉచ్ఛనీచాలను మరచి ఎదుటి వ్యక్తుల్ని స్వార్థంకోసం వుపయోగించుకోవాలనుకుంటే ఫలితం ఎలా ఉంటుందో — కాంతమ్మే నిదర్శనం! 'నిప్పు కాలింది!' అంటూ తరువాత గోలపెట్ట ప్రయోజనం వుండదు.... ఈ కథలోని కాంతమ్మ, అండాళమ్మలు మనకు నిత్యజీవితంలో తరచు తటస్థపడుతూనే ఉంటారు.



— "తిరుమలశ్రీ"

అయిదు వందలకు పైగా ప్రచురింపబడిన నా కథలలో నాకు నచ్చిన కథలు చాలా వున్నా 'విజయ' మాసపత్రిక 1977 సంచికలో ప్రచురించబడిన ఈ కథనే ఎంచుకోడానికి కారణం 'పాఠకులే న్యాయనిర్ణేతలు'గా నిర్వహించిన కథల పోటీలో ఈ కథ ద్వితీయ బహుమతి పొందడమే!